సాక్షి
నల్లగొండ

ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



దైవ దర్శనానికి వెళ్తూ..

దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన అయిటిపాములలో చోటు చేసుకుంది. -IIలో



ఎస్పీకి మంత్రి పరామర్శ

పితృ వియోగం పొందిన మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ నర్సింహాగౌడ్‌ను మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. -IIలో

గరిష్టం/కనిష్టం 39°/23°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐపీసీ సభ్యుడిగా పరమాత్మ



నల్లగొండ టౌన్ : ఇండియన్ ఫార్మకోపియా కమిషన్ (ఐపీసీ) అడ్వయిజరీ కమిటీ సభ్యుడిగా నల్లగొండకు చెందిన తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిలుకూరి పరమాత్మను ఎంపిక చేస్తూ ఐపీసీ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27న ఘజియాబాద్‌లో నిర్వహించే సెమినార్‌లో పాల్గొనాలని ఆహ్వానం పంపింది. ఈ సందర్భంగా ఐపీసీకి పరమాత్మ ధన్యవాదాలు తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి

నల్లగొండ రూరల్ : పాలీసెట్ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక కాకతీయ డిగ్రీ, పీజీ కాలేజీలో ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇష్టంతో చదివితేనే మంచి ర్యాంక్ లభించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారని చెప్పారు. టీఎస్‌ఆర్‌జేసీ, పాలీసెట్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, రాములు, సుధాకర్‌రెడ్డి, మధుసూదన్, యాదగిరి, మహేష్, నవీన్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

మాడుగులపల్లి : ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాడుగులపల్లిలోని ఆ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని కోరారు. రవాణాకు సరిపడా లారీలు సమకూర్చకపోవడంతో సకాలంలో దిగుమతులు పూర్తికాక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. త్వరితగతిన కాంటాలు పూర్తి చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, శ్రీకర్, అశోక్‌రెడ్డి, కన్నయ్య, వెంకటాచారి, అంజయ్య, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శుభవార్త చర్చి ఉత్సవాలు

మఠంపల్లి: జిల్లాలో క్రైస్తవులకు ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న మఠంపల్లిలోని శుభవార్త చర్చి వార్షికోత్సవాలకు సిద్ధమైంది. ఈనెల 24న ప్రత్యేక ప్రార్థనలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 25న జరిగే దివ్యబలి పూజకు నల్లగొండ మేత్రాసన పీఠాధిపతి (బిషప్) పూల ఆంథోని హాజరు కానున్నారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచి క్రైస్తవులు అధికసంఖ్యలో హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించి అన్ని ఏర్పాట్లు చేశామని చర్చి ఫాదర్ మార్టిన్ తెలిపారు. ఉత్సవాల సందర్భంగా శుభోదయ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో రాత్రి మహిళలకు కోలాటం, 28న స్థానిక మాంట్‌ఫోర్ట్ పాఠశాల ఆవరణలో గొర్రె పొటేళ్ల పోటీలు నిర్వహించనున్నట్లు శుభోదయ యూత్ అధ్యక్షుడు గాదె జయభారత్‌రెడ్డి తెలిపారు. విజేతలకు రూ.2లక్షల వరకు నగదు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



విద్యుద్దీపాలతో ముస్తాబైన మఠంపల్లి శుభవార్త చర్చి

ఈద్-ఉల్-ఫితర్



రంజాన్ పండుగ సందర్భంగా నల్లగొండలోని ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ముస్లిం మత గురువు ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండలో శుభాకాంక్షలు తెలుపుతున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

బీసీల కులగణనపై నేడు రౌండ్‌టేబుల్ సమావేశం

నల్లగొండ టౌన్ : దేశంలో బీసీల కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్‌బీఆర్ గార్డెన్స్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు తెలిపారు. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బైరు రవికృష్ణ హాజరవుతున్నారని పేర్కొన్నారు. బీసీ సంఘం నాయకులు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయులు, మేధావులు, కుల సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కిరణ్ బేడీ స్ఫూర్తి



- నాన్న ప్రోత్సాహంతో సివిల్స్ వైపు
- కిరణ్ బేడీలా పోలీస్ అధికారి కావాలనుకున్నా
- సొంతంగా ప్రిపరేషన్‌తో ఐపీఎస్ సాధించాను
- లా అండ్ ఆర్డర్ కంట్రోల్ నిత్యం సవాలే..
- సైబర్ క్రైం కట్టడిపై నా గురి
- యువత లక్ష్యాన్ని ఎంచుకుని శ్రమించాలి
- ప్రణాళిక ఉంటే విజయం తప్పక వరిస్తుంది

ఐపీఎస్ అధికారి సురుకంటి శేషాద్రినిరెడ్డి

సక్సెస్ స్టోరీ



శేషాద్రినిరెడ్డి

బి.జనార్దన్‌రెడ్డి, నల్లగొండ డెస్క్

'సమాజంలో సివిల్ సర్వెంట్లకు ఉన్నతమైన గౌరవం ఉంటుందని తెలుసుకున్నా. ఎప్పటికైనా కిరణ్‌బేడీలా పోలీస్ అధికారిని కావాలనుకున్నా. నాన్న ప్రోత్సాహంతో కల నెరవేర్చుకున్నా. యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని చేరుకునేందుకు శ్రమించాలి' అని యువ ఐపీఎస్ అధికారి శేషాద్రినిరెడ్డి చెప్పారు. తెలంగాణ కేడర్‌కే కేటాయించబడిన ఆమె ప్రస్తుతం నల్లగొండలోని ఎస్పీ కార్యాలయంలో ప్రొబేషనరీ విధుల్లో ఉన్నారు. శేషాద్రినిరెడ్డి తన సక్సెస్‌పై 'సాక్షి'తో మాట్లాడారు. ఆ విశేషాలు ఇవీ..

మాది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం. అమ్మా, నాన్న, తమ్ముడు మా కుటుంబం. నాన్న సురుకంటి సుధాకర్‌రెడ్డి సివిల్ కాంట్రాక్టర్. నేను పుట్టింది, చదువుకుంది అంతా హైదరాబాద్‌లోనే. హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ పూర్తిచేశాను. నాన్న ప్రోత్సాహంతో సివిల్స్‌పై దృష్టిపెట్టాను. సివిల్ సర్వీసెస్ ఆఫీసర్‌గా ప్రజలకు ఎంతో సేవ చేసే అవకాశం ఉంటుందని, వాళ్లకు సమాజంలో ఉన్నతమైన గౌరవం ఉంటుందని తెలుసుకుని అటువైపు అడుగులు వేశాను.

స్వతహాగానే ప్రిపరేషన్


ఇంజనీరింగ్ పూర్తయిన వెంటనే సివిల్స్ ప్రిపరేషన్ మొదలుపెట్టాను. కోచింగ్‌కు వెళ్లకుండానే.. ఆన్‌లైన్ మెటీరియల్ చదివాను. మోడల్ పేపర్‌లను ఫాలో అయ్యాను. సీనియర్ల గైడెన్స్, మాక్ ఇంటర్వ్యూల ద్వారా అవగాహన పెంచుకున్నా. నేను ఇంజనీరింగ్ చదివినప్పటికీ సివిల్స్‌లో ఆప్షనల్‌గా తెలుగు లిటరేచర్ తీసుకున్నా. తెలుగుపై అనేక సాహిత్య, సాంస్కృతిక, చరిత్ర పుస్తకాలను చదివాను. 2019లో మొదటిసారిగా సివిల్స్ పరీక్ష రాశాను. అప్పుడు ఎంపిక కాలేదు. ఆ తర్వాత 2020 సంవత్సరంలో రెండో ప్రయత్నంలో (401) ర్యాంకు వచ్చింది. ఐపీఎస్‌కు ఎంపికయ్యాను.

నాన్న కల నెరవేర్చాను

మా నాన్న ఎం.కాం చదివారు. అప్పట్లో గ్రూప్‌–1 పరీక్ష రాశారు. ఇంటర్వ్యూలో సెలక్ట్ కాలేదు. మా ద్వారా ఆయన కల నెర్చుకోవాలనుకున్నారు. చిన్నప్పటి నుంచే ఆ దిశగా నన్ను ప్రోత్సహించారు. ఐపీఎస్ కావాలని చెప్పేవారు. దేశంలోని ఉత్తమ పోలీస్ అధికారుల గురించి వివరించే వారు. కిరణ్ బేడీ గురించి తెలుసుకున్నా. ఆమే నాకు స్ఫూర్తి. ఎప్పటికైనా అలా కావాలనుకున్నా. నేను ఐపీఎస్ సాధించి నా కల నెర్చుకోవడంతో పాటు నాన్న కలను కూడా నెరవేర్చాను.

అందరూ చీరకట్టులో..నేను చుడీదార్‌లో

సివిల్స్ ఇంటర్వ్యూ రోజున మహిళలంతా చీరకట్టులో వచ్చారు. నేను ఒక్కదాన్నే చుడీదార్‌లో వెళ్లాను. చీర ఎందుకు కట్టుకోలేదని బోర్డు సభ్యులు అడిగారు. నాకు చీర కంఫర్ట్ కాదని చెప్పాను. ఇంటర్వ్యూలో తడబడవద్దు. మనం ఏది చెప్పాలనుకుంటే అది చెప్పేయాలి. కమ్యూనికేషన్ కమాండ్ ఉండాలి. కాన్ఫిడెంట్‌గా ఉండాలి. నా సబ్జెక్టు తెలుగు కాబట్టి.. తెలుగు చరిత్రపై ఎక్కువ ప్రశ్నలు అడిగారు. కరెంట్ ఎఫైర్స్ కూడా అడిగారు.



ఐపీఎస్ శిక్షణలో శేషాద్రినిరెడ్డి (ఫైల్)

సైబర్ క్రైం అరికట్టడంపై దృష్టిపెడతా..

ప్రస్తుతం పోలీస్ శాఖకు సైబర్ క్రైం సవాల్ విసురుతోంది. దేనిపట్ల సీనియర్ అధికారులు అమలు చేస్తున్న విధానాలు తెలుసుకుంటా. భవిష్యత్తులో మరింతగా సైబర్ నేరాలను ఎలా కట్టడి చేయాలన్న దానిపై దృష్టిపెడతా. ప్రజలకు పోలీసింగ్ మరింత చేరువ చేసేందుకు కృషిచేస్తా.

ఇంట్లో భక్తి ఎక్కువ

అమ్మానాన్నకి భక్తి ఎక్కువ. అందుకు నాకు వేంకటేశ్వరస్వామి పేరు వచ్చేలా శేషాద్రినిరెడ్డి అని పెట్టారు. తమ్ముడి పేరు శివదుర్గారెడ్డి. వరంగల్‌లోని ఎన్ఐటీ(నిట్)లో గ్రాడ్యుయేషన్ చేస్తున్నాడు.

థియరీకి.. ప్రాక్టికల్‌కి ఎంతో తేడా

ఐపీఎస్ శిక్షణలో నేర్చుకున్నదానికి, ప్రాక్టికల్‌గా చూస్తున్నదానికి ఎంతో తేడా ఉంది. వృత్తిపరమైన అంశాలపై ఎస్పీ అపూర్వరావు వివరంగా చెబుతున్నారు. ఎస్పీ వద్ద ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నా. డ్యూటీలో చాలా వర్క్ చేయాల్సి ఉంటుంది. మానిటరింగ్ చేయాలి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. లా అండ్ ఆర్డర్‌పై కంట్రోల్ ఉండాలి.

లక్ష్యాన్ని చేరుకునే వరకు శ్రమించాలి

యువత గోల్ పెట్టుకోవాలి. తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలి. దాని ప్రకారం శ్రమించాలి. గోల్ పెట్టుకోకుండా.. తమకు ఏం కావాలో నిర్ణయించుకోకుండా ముందుకు వెళితే ప్రయోజనం ఉండదు. ఒక్కసారి ఓటమిచెందితే నిరుత్సాహపడవద్దు. విజయం మన సొంతమయ్యే వరకు ప్రయత్నం చేస్తూనే ఉండాలి. సరైన మార్గనిర్దేశనం అవసరం.

గిరిజనులకు వరం 'గిరి వికాసం'

- భూములకు నీటి వసతి కల్పించడమే లక్ష్యం
- పది ఎకరాలు ఒక యూనిట్‌గా ఎంపిక
- 11 మండలాల్లో 131 యూనిట్ల మంజూరు
- అవగాహన లేక దరఖాస్తు చేసుకోని గిరిజనులు



తేనపల్లి తండాలో సర్వే చేస్తున్న భూగర్భ జలవనరుల శాఖ అధికారులు (ఫైల్)

గుర్రంపోడు : గిరిజన రైతులకు 'గిరి వికాసం' పథకం అండగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా గిరిజనుల భూములను సాగులోకి తీసుకురావడం, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలైన బోరు, కరెంటు, పైపులైన్ సౌకర్యం కల్పిస్తారు. ఉపాధిహామీ పనుల ద్వారా బండరాళ్లు తొలగించడం, పండ్ల మొక్కల సరఫరా, సాగులో సలహాలు అందిస్తారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ పథకం అమలవుతోంది. సొంతంగా బోరు, మోటారు, విద్యుత్ సౌకర్యం కల్పించుకోలేక మెట్టపంటలు సాగుచేసుకుంటూ ఎదుగుబొదుగు లేని జీవితాలు గడుపుతున్న గిరిజనుల భూములకు సాగునీటి వసతితో వరి, పండ్లతోటల పంటలు సాగు చేసుకునే వీలు కల్పించే ఈ పథకం వారి పాలిట వరప్రసాదమే. అయిత ఈ పథకంపై గిరిజనులకు అవగాహన లేదు. ఏడాది కాలంగా అందిన దరఖాస్తుల సంఖ్య, లబ్ధిదారుల ఎంపికనే ఇందుకు నిదర్శనం.

గతంలో లబ్ధిపొందని వారికే..

ఉపాధిహామీ జాబ్ కార్డు గల ఐదెకరాలలోపు భూమి ఉన్న ఇద్దరు లేక ముగ్గురు రైతులను గుర్తించి పది ఎకరాల వరకు ఒక యూనిట్‌గా పరిగణలోకి తీసుకుంటారు. జియాలజిస్టు సర్వే నివేదికలో నీటి లభ్యత తప్పనిసరి. గతంలో మాదాపథకం, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి ఇందిర జలప్రభ పథకంలో ప్రయోజనం పొందని రైతులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.

అత్యధికంగా గుర్రంపోడు మండలంలో

జిల్లా వ్యాప్తంగా గిరిజన రైతుల నుంచి 250 యూనిట్లకు దరఖాస్తులు రాగా అందులో అర్హతల మేరకు 11 మండలాల్లో 131 యూనిట్లను మంజూరు చేశారు. అత్యధికంగా గుర్రంపోడు మండలంలో 27 యూనిట్లను మంజూరు చేశారు. ఇందులో 17 యూనిట్లలో నీటి లభ్యత ఉన్నట్లుగా జియాలజిస్టు సర్వే నివేదిక అందించారు. త్వరలోనే బోర్లు వేయనున్నారు. పీఏపల్లి మండలంలో 19, దేవరకొండలో 22, డిండిలో 21, తిరుమలగిరి సాగర్‌లో 21, చింతపల్లిలో 1, పెద్దవూరలో 5, నేరడుగొమ్ములో 7, చందంపేటలో 7, కనగల్ మండలంలో 1 యూనిట్ చొప్పున మంజూరు చేశారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం గిరిజన రైతుల ఆర్థిక ఉన్నతికి చేయూతనందించే లక్ష్యంతో గిరి వికాసం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అర్హతలు గల గిరిజన రైతులు ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలి. గిరి వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కాళిందిని, డీఆర్‌డీఓ

తడిసి ముద్దయిన ధాన్యం



శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి మాడుగులపల్లి మండలం పాములపాడు ఐకేపీ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం రాశులు

రైతులు అధైర్య పడొద్దు

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



కంచనపల్లి కొనుగోలు కేంద్రం వద్ద వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నల్లగొండ రూరల్ : పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడొద్దని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. శనివారం ఆయన నల్లగొండ మండలంలోని కంచనపల్లి పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. లోతట్టులో ధాన్యం రాశులు పోయొద్దని సూచించారు. ఈ నెల 11వ తేదీన జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించామని ఇప్పటి వరకు రాష్ట్రంలో 1,27,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. నల్లగొండ జిల్లాలో 272 కేంద్రాల ద్వారా 78,392 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 9,380 మంది రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు, ఎగుమతి, దిగుమతిపై నిరంతరం అధికారులతో సమీక్షిస్తున్నామని చెప్పారు. రోజూ 10 వేల నుంచి 12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వివరించారు. అదేవిధంగా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు చందనపల్లి, రెడ్డిబావి కేంద్రాలను డీఆర్‌డీఓ కాళిందిని కొత్తపల్లి కేంద్రాన్ని పరిశీలించారు.

కొనుగోళ్లను వేగవంతం చేయాలి

కనగల్ : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డీఆర్‌డీఓ కాళిందిని సూచించారు. శనివారం కనగల్ మండలంలోని కురంపల్లి, కనగల్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఎండల నేపథ్యంలో రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. తూకంలో తేడా రాకుండా, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. నిర్వాహకులు ఎప్పటికప్పుడు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు.



కురంపల్లిలో కాంటాను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ

పరిహారం అరకొర!

- మార్చిలో అకాల వర్షాలతో 1060 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ నివేదిక
- ప్రభుత్వం పరిహారం ఇచ్చింది 371 ఎకరాలకే..
- మిగిలిన రైతులకు నిరాశే



నల్లగొండ అగ్రికల్చర్ : యాసంగి సీజన్‌లో మార్చినెలలో కురిసిన అకాల వర్షాల కారణంగా జిల్లాలో పంటనష్టం వాటిల్లిన రైతులకు నిరాశే మిగిలింది. వర్షాలతో వరి, వేరుశనగ, మిర్చి, పండ్ల తోటలకు నష్టాన్ని అంచనావేసిన జిల్లా వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. 33 శాతానికి పైగా నష్టం జరిగిన పంటల వివరాలను సేకరించింది. గుర్రంపోడు, మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో మొత్తం 136 మంది రైతులకు సంబంధించి 1060 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు నివేదించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పంట నష్ట పరిహారానికి, జిల్లా వ్యవసాయ శాఖ నివేదించిన లెక్కలకు ఎక్కడా పొంతన లేదు. వ్యవసాయ శాఖ వేసిన అంచనాల్లో 3వ వంతు మాత్రమే నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని విడుదల చేసింది. కేవలం 371 ఎకరాల్లో మాత్రమే వరి, మిర్చి తోటలు, ఇతర పంటలకు నష్టం జరిగినట్లు నిర్ధారించి కేవలం 37లక్షల 60వేల రూపాయల పంట నష్ట పరిహారాన్ని ప్రభుత్వం విడుదల చేసి రైతులకు తీరని అన్యాయాన్ని మిగిల్చింది.

పంట నష్టం వివరాలు (ఎకరాల్లో) ఇలా..

మండలం	వరి	మిర్చి	తోటలు	ఇతర పంటలు	మొత్తం
గుర్రంపోడు	120	12	-	-	132
మర్రిగూడ	173	30	75	30	308
నాంపల్లి	92	48	195	285	620
మొత్తం	385	90	270	315	1060

పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం..

అకాల వర్షాలతో ఆరుగాలం పండించిన పంటలకు నష్టం జరిగినా.. పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులైనా పరిహారం వచ్చాక చెల్లిద్దామనుకున్న రైతులకు బంగపాటు తప్పలేదు. జిల్లా వ్యవసాయ శాఖ 33 శాతానికి పైగా జరిగిన పంటల వివరాలను మాత్రమే సేకరించి నివేదించినప్పటికీ ప్రభుత్వం ఏ లెక్కన పరిహారం విడుదల చేసిందో అర్థం కాని పరిస్థితి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రైతులందరికీ పరిహారం చెల్లించాలి



మార్చిలో కురిసిన అకాల వర్షంతో పంటలకు నష్టం వాటిల్లిన రైతులందరికీ పరిహారం చెల్లించాలి. వ్యవసాయ శాఖ వేసిన లెక్కలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పరిహారానికి పొంతన లేకుండా ఉంది. మిగిలిన రైతులకు కూడా పరిహారం అందించి ఆదుకోవాలి.

– పాశం నరేష్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం చెల్లించాలి



అకాల వర్షాలతో 33 శాతానికి పైగా నష్టం జరిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ పంపిన లెక్కల ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏ లెక్కన పరిహారం చెల్లిస్తున్నారో అర్థం కావడం లేదు. మిగిలిన రైతులకు కూడా నష్ట పరిహారం చెల్లించాలి.

– నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లాకార్యదర్శి

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం కాటన్ మిల్లు సమీపంలో రోడ్డు పక్కన శనివారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రాఘవరావు, ఎస్ఐ వాస ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని నల్లగొండ మార్చురీకి తరలించారు.మృతుడికి 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ పేర్కొన్నారు. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆచార్య రవ్వా శ్రీహరి మృతికి సంతాపం

రామగిరి(నల్లగొండ): ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య రవ్వా శ్రీహరి అకాల మృతికి జిల్లా రచయిత సంఘం అధ్యక్షుడు మేరెడ్డి యాదగిరిరెడ్డి, సాహితీ మేఖల సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య శనివారం సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిఘంటు నిర్మాత, సంస్కృత పండితులు, ద్రావిడ విశ్వ విద్యాలయ పూర్వ ఉపకులపతిగా ఆచార్య రవ్వా శ్రీహరి పని చేసినట్లు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మాండలిక పదకోశం అనే నిఘంటువును నిర్మించి తెలుగు సాహిత్య రంగానికి బాటలు వేశారన్నారు.

ఒడిశా వలస కార్మికులకు విముక్తి

నకిరేకల్ : ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఒడిశా వలస కార్మికులకు పోలీసులు, కార్మిక శాఖ అధికారులు విముక్తి కల్పించారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సీఐడీ చీఫ్ మహేష్ ఎం భగవత్ ఆదేశాల మేరకు సీఐడీ డీఎస్పీ ఎర్రా, ఇన్‌స్పెక్టర్‌లు చెరుకు నాగరాజు,రమేశ్‌ల ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్ మండలం చందుపట్ల లోని ఎస్ఎస్ఆర్ ఇటుక బట్టీలపై దాడులు చేశారు. అక్కడ ఏడుగురు పరుషులు, ఆరుగురు మహిళలు, నలుగురు బాల బాలికలు పనిచేస్తున్నట్లు గుర్తించారు. యజమాన్యం వారికి వేతనం ఇవ్వకుండా, నిర్బంధించి పనులు చేయించుకుంటున్నారని తేలింది. ఈ సమాచారం ఆ రాష్ట్రాల లేబర్ వారికి సమాచారం అందడంతో తెలంగాణ సీఐడీ చీఫ్ మహేష్ భగవత్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసులు దాడులు చేశారు. సంబంధిత యాజమాన్యంతో మాట్లాడి వారికి రావాల్సిన వేతనాలను ఇప్పించారు. వారు సొంత రాష్ట్రానికి వేళ్లేందుకు అయ్యే ఖర్చులు, భోజన ఖర్చులను కూడా ఇప్పించారు. ప్రత్యేక వాహనంలో వారిని నల్లగొండ రైల్వే స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి ఒడిశాకు పంపించారు.

కూలిన చెట్లు.. తడిసిన ధాన్యం


కట్టంగూరు మండలం గంగదేవిగూడెంలో నెలకొరిగిన నిమ్మచెట్లను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్


సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యం బస్తాలు

- అకాల వర్షానికి మార్కెట్‌లలో కొట్టుకుపోయిన ధాన్యం రాశులు
- ఈదురుగాలులకు నేలరాలిన మామిడికాయలు
- పలు చోట్ల విరిగిన విద్యుత్ స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- మూగజీవాల మృత్యువాత


చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతు

కట్టంగూర్ : అకాల వర్షం రైతాంగాన్ని మరోసారి ఇబ్బందుల పాలు చేసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఉమ్మడి జిల్లాలో ఈదురు గాలులతో కూడిన మోస్తరు వర్షం పడింది. దీంతో ఆయా మండలాల్లో వరిపైరు నేలకొరిగింది. ఇప్పటికే కోత కోసి కొనుగోలు కేంద్రాల్లో ఉంచిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కట్టంగూరు మండలంలో కురిసిన వర్షం రైతులను కన్నీరు పెట్టించింది. ఐకేపీ కేంద్రంలో నిలువ ఉంచిన ధాన్యం రాశుల కిందుగా నీరు ప్రవహించటంతో తడిసి కొట్టుకుపోయాయి. కేంద్రాల్లో పట్టాలు పంపిణీ సక్రమంగా లేకపోవటంతో ధాన్యం తడిసింది. ముందుస్తుగానే కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయకపోవటం వల్ల తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొన్నారు. మండలంలోని చెర్వుఅన్నారం, అయిటిపాముల, కట్టంగూర్, కురుమర్తి, పరడ, నారెగూడెం, మునుకుంట్ల ధాన్యం కేంద్రాల్లో సుమారు 145 ధాన్యం రాశులు(3280 క్వింటాళ్లు) తడిసి ముద్దయ్యాయి. తూకం వేసిన బస్తాలు 5481(2192 క్వింటాలు) తడిసి ముద్దయ్యాని తహసీల్దార్ దేశ్యానాయక్ తెలిపారు. అదే విదంగా మండలంలోని గంగదేవిగూడెం, అయిటిపాములతో పాటు పలుగ్రామాల్లో అకాల వర్షానికి ఈదురుగాలులకు నిమ్మచెట్లు నేలకొరిగి, మామిడి చెట్లు దెబ్బతిన్నాయి. నేలకొరిగిన నిమ్మ, మామిడిచెట్లను నకిరేకల్ హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్ పరిశీలించారు. కొమ్మలు విరిగి మామిడికాయలు రాలటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అయిటిపాములకు చెందిన రైతు అనంతుల రమేష్‌కు చెందిన 100 మామడిచెట్ల కొమ్మలు ఈదురుగాలులకు విరిగి కాయలు రాలి తీవ్రంగా నష్టపోయాడు.

మాడుగులపల్లిలో..

మాడుగులపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తెల్లవారుజామున ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పాములపాడులో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంలో పిడుగుపడడంతో ఆవు మృతి చెందింది. ఐకేపీ కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇసుకబాయిగూడెంలో హైమాస్ట్ లైట్ల స్తంభం విరిగిపడింది. వేములపల్లి-ఇసుకబాయిగూడెం రోడ్డు వెంట చెట్ల కొమ్మలు నేలకూలాయి. కన్నెకల్లు, ధర్మపురం గ్రామాల్లో ఉద్యాన పంటలకు స్వల్ప నష్టం వాటిల్లింది. మాచినపల్లి గ్రామంలో మూడు చోట్ల పిడుగులు పడినట్లు గ్రామస్తులు తెలిపారు. చాలా గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి సరఫరాకు అంతరాయం కలగడంతో అంధకారం నెలకొంది.

వేములపల్లిలో..

వేములపల్లి : రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేసి ఐకేపీ కేంద్రాలకు తరలించిన ధాన్యం శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో రాత్రి కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయింది. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగవంతం చేయకపోవడంతో కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసిపోయిందని ఆవేద వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలను వేగవంతం చేసి ఆదుకోవాలన్నారు.

దండుమల్కాపురంలో 20గొర్రైలు మృతి

చౌటుప్పల్ : గత రాత్రి కురిసిన అకాల వర్షానికి మండలంలో అంతా ఆగమాగం అయ్యింది. మండల పరిధిలోని ఎస్.లింగోటం గ్రామంలో ఉప్పు వెంకటేశంకు చెందిన కోళ్లఫారం గోడ కూలింది. ఫాంలోని మూడు వందల బ్రాయిలర్ కోళ్లు చనిపోయాయి. సుమారుగా 3లక్షల వరకు నష్టం జరిగిందని రైతు తెలిపాడు. మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో పిల్లి రాజుయాదవ్‌కు చెందిన గొర్రెల షెడ్డు ప్రహరీ ఈదురుగాలులకు కూలింది. దీంతో 20గొర్రైలు మృతిచెందగా, 4గొర్రైలు, 2మేకలు ప్రాణాపాయస్థితిలో ఉన్నాయి. మరో 20గొర్రెలకు గాయాలయ్యాయి. యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండెబోయిన అయోధ్యయాదవ్ రైతును పరామర్శించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ గొర్రైలు వైద్యం అందించారు. పలు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి.

రామన్నపేటలో..

రామన్నపేట : మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు తీవ్రంగా నష్టపోయాయి. బలమైన ఈదరుగాలులలో కూడిన వర్షానికి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్‌స్తంభాలు నేలకొరిగి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొనుగోలు కేంద్రాలలో పోసిన ధాన్యం తడిసింది. వరదలకు ధాన్యం కొట్టుకుపోగా, ఆరబెట్టిన రాశుల కిందికి నీరు చేరింది. కొట్టుకుపోయిన ధాన్యంను ఎత్తడానికి, తడిసిన ధాన్యంను అరబెట్టడానికి రైతులు ఇంటిల్లిపాది శ్రమించవలసి వచ్చింది. మామిడికాయలు నేలరాలాయి. రామన్నపేటలో కౌలు రైతు రవి సాగుచేసిన బొప్పాయితోట సగానికి పైగా నేల కొరిగింది. కోతకు సిద్దంగా ఉన్నటువంటి వరిచేలలో గింజలు నేల రాలాయి. మండలకేంద్రంలోని ప్రధానవీధులు చెట్ల ఆకులు కొమ్మలతో నిండిపోయాయి. వీధులను శుభ్రం చేయడానికి పంచాయతీ కార్మికులు తీవ్రంగా శ్రమించారు.


మాడుగులపల్లి మండలం ఇసుకబావిగూడెంలో విరిగిన స్తంభం

గట్టుప్పలలో..

చండూరు(గట్టుప్పుల) : గట్టుప్పల మండలం పరిధిలోని శేరిగూడెం,తేరట్‌పల్లి గ్రామ శివారులో వరి చేలు ధ్వంసమయ్యాయి. చేతికి వచ్చిన వరి పంటలు కోసేందుకు యంత్రాల ఆలస్యంతో రైతులు నిండా మునిగారు. తేరట్‌పల్లిలో జంగయ్యకు చెందిన ఈదురు గాలులకు గోడ కూలి బర్రె , దూడకు తీవ్ర గాయాలయ్యాయి.

పొలాలను పరిశీలించిన తహసీల్దారు

ఈదురు గాలులు..అకాల వర్షానికి నష్టం జరిగిన పంట పొలాలను తహసీల్దారు దేవుల పల్లి వెంకటేశ్వర్లు , ఏఈఓ నాగార్జునలు తేరట్‌పల్లి, శేరిగూడెం గ్రామాల్లో పరిశీలించారు. రెండు గ్రామాల్లో సుమారుగా 190 నుంచి 200 ఎకరాల వరకు పంట నష్టం జరిగిందని అధికారులకు నివేదిక ఇస్తున్నట్లు తెలిసింది.

రాజాపేటలో..

రాజాపేట : మండలంలోని కుర్రారం, బొందుగుల, పారుపల్లి, బూర్గుపల్లి, జాల తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలలతో కూడిన వడగండ్ల వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. వరిపంట నేలకొరిగింది. కుర్రారం గ్రామంలో ఏకంగా 22 ఎకరాల్లో మామిడి కాయలు నేలరాలాయని రైతు పెంటపర్తి రాజిరెడ్డి, మాదవరెడ్డిలు ఆవేదన వ్యక్తం చేశారు.


తేరట్‌పల్లిలో విరిగిన వేప చెట్టు


రామన్నపేట మార్కెట్‌లో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు


గట్టుప్పల: శేరిగూడెంలో పంటను పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఏఈఓ నాగార్జున


దండుమల్కాపురం గ్రామంలో ప్రహరీ కూలడంతో చనిపోయిన గొర్రెలు


చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామంలో గోడ కూలి చనిపోయిన కోళ్లు


శేరిగూడెంలో రాలిన వడ్లు


గంగదేవిగూడెంలో ఈదురుగాలులకు రాలిన మామిడి కాయలు


అయిటిపాముల ఐకేపీ కేంద్రంలో వర్షానికి తడిసిన ధాన్యం


సూర్యాపేట మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

అదృశ్యమైన వ్యక్తి మృతి

మేళ్లచెరువు : అదృశ్యమైన వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మేళ్లచెర్వులో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. చింతలపాలెం గ్రామానికి చెందిన గొంగిరెడ్డి భిక్షారెడ్డి (50) ఈ నెల 5వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయినట్లు స్థానిక పోలీసు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. కాగా, మండలకేంద్రంలో పరిధిలోని చింతలపాలెం రోడ్డు జోగు కుంట పరిధిలో కుళ్లిపోయిన మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి మృతుడు భిక్షారెడ్డిగా గుర్తించారు. అతడు చనిపోయి పక్షం రోజులు కావడంతో మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారుడు మధుసూదన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఆనంద్ నాయక్ తెలిపారు.

మహబూబ్‌నగర్ ఎస్పీకి మంత్రి పరామర్శ


మారయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీనివాస్ గౌడ్

చండూరు : మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ కొత్తపల్లి నర్సింహగౌడ్ తండ్రి మారయ్య (75) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని శనివారం ఎ క్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ శనివారం ఎస్పీ స్వగ్రామమైన చండూరు మండలం కొండాపురం గ్రామంలో పరామర్శించారు. ఆయన వెంట చండూరు గౌడ సంఘం అధ్యక్షుడు భీమనపల్లి శేఖర్, వడ్డే పల్లిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక లారీల పట్టివేత

కేతేపల్లి: హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను శనివారం పట్టుకుని కేసు నమోదు చేశామని కేతేపల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రా ప్రాంతం నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో తెల్లవారుజామున కేతేపల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి, సిబ్బందిలో కలసి హైవేపై కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్న మూడు లారీలను పోలీసులు పట్టుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి డ్రైవర్ల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవటంతో లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న లారీల యజమానులు వంగూరి వెంకటయ్య, గాజుల లింగయ్య, తాళ్ళ నరేందర్‌రెడ్డిలతో పాటు ఆయా వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్ రెడ్డి పేర్కొన్నారు.

మంత్రాలు చేశారంటూ దూషించిన వ్యక్తిపై దాడి

గుర్రంపోడు : మంత్రాల కారణంగా తన భార్య చనిపోయిందంటూ దూషించిన వ్యక్తిని మహిళలలు చెట్టుకు కట్టేసి కొట్టారు. ఈ ఘటన మండలంలోని కొత్తలాపురం గ్రామంలో జరిగింది. ఎస్ఐ శివప్రసాద్ తెల్పిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తలాపురం గ్రామానికి చెందిన చామకూరి సత్తయ్య భార్య చనిపోగా రెండో భార్య ఇతనితో ఘర్షణ పడి వెళ్లిపోయింది. సత్తయ్య 9వ తరగతి చదువుతున్న కుమారుడితో కలిసి ఉంటున్నాడు. తన భార్యకు మంత్రాలు చేశారంటూ గ్రామానికి చెందిన చామకూరి చంద్రమౌళిని కొంతకాలంగా దూషిస్తున్నాడు. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి చంద్రమౌళి ఇంట్లో ప్రవేశించి కుటుంబ సభ్యులను దూషించాడు. ఉదయమే చంద్రమౌళి , ఇతని కుమారుడు రఘు, కోడలు కవిత, మరికొంత మహిళలు ఇతనిని పట్టుకుని స్తంభానికి కట్టేసి దాడి చేశారు. చంద్రమౌళి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సత్తయ్యపై కేసు నమోదు చేశామన్నారు. సత్తయ్యపై జరిగిన దాడి విషయంలోనూ విచారణ జరిపి తగు చర్య తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

పిడుగుపాటుతో రెండు గేదెలు మృతి

శాలిగౌరారం: వేర్వేరు చోట్ల పిడుగుపాటుతో రెండు గేదెలు మృతిచెందాయి. శాలిగౌరారం ,తిప్పర్తి మండలా పరిధిలో చోటు చేసుకున్న ఈఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. శాలిగౌరారం మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల అశోక్ తన ఇంటి సమీపంలో ఉన్న పశువులకొట్టంలో చెట్టుకు గేదెను కట్టేసి ఉంచాడు. రాత్రి అకాలంగా ఈదురుగాలులు, ఉరుములతో పాటు చెట్టుపై పిడుగు పడటంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

జంగారెడ్డిగూడెంలో..

రామగిరి(నల్లగొండ): మండలంలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తండు సత్తయ్యకు చెందిన గేదే ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు కట్టేశారు. శుక్రవారం రాత్రి వేప చెట్టు వద్ద పిడుగు పడడంతో చెట్టు కింద ఉన్న గేదె మృతిచెందింది.

ధైవ దర్శనానికి వెళ్తూ మృత్యుఒడికి


- రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కట్టంగూర్ : దైవ దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామశివారు 65వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల టౌన్‌కు చెందిన దుస్స విఘ్నేష్(20) తన స్నేహితుడు పెద్ది సుమంత్‌తో కలిసి కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునేందుకు శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాదు నుంచి టాక్సీలో బయలుదేరారు.మార్గమధ్యలో అయిటిపాముల గ్రామశివారులో గల విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే కారు డ్రైవర్ రాజ్‌కళ్యాణ్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ముందున్న లారీని వెనకనుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు సీట్లో ఎడమవైపు కూర్చున్న విఘ్నేష్ తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రున్ని తన స్నేహితుడు నకిరేకల్ ప్రభుత్వ తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి బాబాయ్ బరిగెల జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

బోర్‌వెల్ వాహనాన్ని ఢీకొని..

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఘటన శనివారం దేవరకొండ మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డిండి మండల పరిధిలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన కుమార్(21) దేవరకొండలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూనే పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన బంధువు రాఘవులుతో కలిసి శనివారం స్వగ్రామమైన గోనబోయినపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై వాహన రిజిస్ట్రేషన్ నిమిత్తం దేవరకొండ మీదుగా హైదరాబాద్‌కు బయల్దేరారు.ఈ క్రమంలో దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి సమీపంలోకి రాగానే దేవరకొండ నుంచి డిండి వైపు వెళ్తున్న బోర్‌వెల్ వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న కుమార్, రాఘవులుకు తీవ్ర గాయాలయ్యాయి.సమాచారం అందుకున్న దేవరకొండ ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస్‌తో పాటు ఎస్ఐ సతీష్‌లు 108 వాహనంలో క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.గాయాలపాలైన రాఘవులును హైదరాబాద్‌కు తరలించారు.ఈ మేరకు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి


వీరయ్య(ఫైల్)

అర్వపల్లి: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జీడి పెద్దవీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. పీరయ్య దశదినకర్మ శనివారం కాగా స్నానాల కోసం బంధువులు అంతా కలిసి గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈక్రమంలోనే పీరయ్యకు వరుసకు మనుమడైన జీడి వీరయ్య(35) స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయాడు. అయితే బావిలో దిగిన వారి అందరి స్నానాలు అయిపోయాక తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో వీరయ్య చెప్పులు, దుస్తులు బావి ఒడ్డున ఉన్నాయి. వీటిని చూసి బంధువులు వీరయ్య కోసం వెతికారు. ఎక్కడా కనిపించకపోవడంతో విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి తాళ్లతో బావిలో వెతికించారు. అప్పటికే వీరయ్య మరణించాడు. వీరయ్య మృతదేహాన్ని తాళ్ల సాయంతో బయటకు తీయించారు. ఈ సంఘటనతో గ్రామ ఎస్సీకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య మల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజిరెడ్డి తెలిపారు. కాగా సంఘటన విషయం తెలిసిన వెంటనే సూర్యాపేట జడ్పీటీసీ జీడి భిక్షం, కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబీకులను పరామర్శించారు.

సంతలో సెల్‌ఫోన్ చోరీ

కట్టంగూర్ : కట్టంగూర్ కూరగాయల సంతలో శనివారం సెల్‌ఫోన్ చోరీకి గురైంది. మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మేడి మహేష్ వారసంత కావటంతో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చాడు. అండర్‌పాసింగ్ సమీపంలో కూరగాయలు కొనుగోలు చేస్తుండగా పాయింట్ జేబులో ఉన్న తన సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి అపహరించుకుపోయాడు. ఇంటికి వెళుతూ జేబును చెక్‌చేసుకోగా సెల్‌ఫోన్ కనబడలేదు. వెంటనే వేరే మొబైల్‌తో ఫోన్‌చేయగా స్విచ్ఆఫ్ చేసి ఉందని బాధితుడు తెలిపాడు. నెలరోజుల క్రితమే 5జీ నెట్‌వర్క్‌తో కూడిన రూ.22వేల విలువగల సెల్‌ఫోన్ కొన్నానని తెలిపాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

జిల్లా కేంద్రంతోపాటు నల్లగొండ, నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల్లో శనివారం ముస్లింలు రంజాన్ పర్వదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్


నల్లగొండలోని ఈద్గా వద్ద రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్ ఎస్పీ, ఎమ్మెల్యే తదితరులు


నల్లగొండలోని ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు


నల్లగొండలో మాట్లాడుతున్న మత గురువు


నకిరేకల్‌లో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


నార్కట్‌పల్లి : శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి


చండూరులో ..


గట్టుప్పల మండల కేంద్రంలో..


నల్లగొండలోని ఈద్గా వద్ద మంచినీరు అందజేస్తున్న కట్టెల శివకుమార్


శుభాకాంక్షలు తెలుపుతున్న దుబ్బాక నర్సింహారెడ్డి


శుభాకాంక్షలు తెలుపుతున్న టీఎన్జీఓ నాయకులు


నకిరేకల్ : శుభాకాంక్షలు తెలుపుతున్న వేముల వీరేశం


శాలిగౌరారం : ఆకారంలో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


కనగల్ : ఎంపీపీ కరీంపాషకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


చిట్యాల: గుండ్రాంపల్లిలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు


మర్రిగూడ : వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు


కేతేపల్లి : శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య


శుభాకాంక్షలు తెలుపుతున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల

క్లుప్తంగా

ఎమ్మెల్యే కంచర్ల ఆర్థికసాయం

కనగల్ : మండల పరిధిలోని తుర్కపల్లి గ్రామానికి చెందిన బొమ్మపాల వెంకటయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమేరకు బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పంపిన రూ.10 వేల నగదును శనివారం జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాంగిరి శ్రీధర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు అయితగోని యాదయ్యగౌడ్, జొన్నలగడ్డ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడిగా మోహన్‌రావు



నల్లగొండ టౌన్ : తెలంగాణ రాష్ట్ర లయన్స్ క్లబ్ మల్టిపుల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా నల్లగొండకు చెందిన లయన్స్ జిల్లా 320 ఈ గవర్నర్ తీగల మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన 7వ లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మోహన్‌రావును జగిని భీమయ్య, గోలి అమరేందర్‌రెడ్డి, నేతి రఘుపతి, మురళీధర్‌రెడ్డి, గట్టుపల్లి అశోక్‌రెడ్డి , శివప్రసాద్, యారాల ప్రభాకర్‌రెడ్డిలు అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో పేర్వారం అంకమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు రాములు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ఆ గ్రామ సర్పంచ్ మర్రి జలంధర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు లడే రాములు, బీఆర్‌ఎస్ నాయకులు అర్రూరి స్వామి, భాస్కర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాకు వ్యతిరేకంగా కొనసాగుతున్న దీక్షలు


దీక్ష చేస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

మునుగోడు : ఫార్మా కంపెనీ నిర్మాణ విషయంలో ప్రజల అభిప్రాయాలు తీసుకున్న తరువాతే పనులు కొనసాగించాలని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు డిమాండ్ చేశారు. మండలంలోని కిష్టాపురం గ్రామంలో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు రెండోరోజు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కంపెనీ అనుమతులు రద్దు చేసేవరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహగౌడ్, అఖిల పక్ష పార్టీల నాయకులు మునుకుంట్ల భూపాల్, పంతంగి రవి, నందిపాటి వెంకన్న, సింగినేని శ్యామ్, శేఖర్, మునుకుంట్ల మల్లయ్య, చెల్లాచారి, పరమేష్, నరేష్, వెంకన్న, రాఘవులు, లింగస్వామి, సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ


నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న రమాదేవి

నార్కట్‌పల్లి : హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్ పాఠశాల ప్రిన్సిపాల్ బండ రమాదేవి శనివారం మండలంలోని నక్కలపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, షూ, యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తన సొంత ఖర్చుతో విద్యార్థులకు వేసవి సెలవుల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను గ్రామంలో ఉచితంగా నిర్వహించి వారికి పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాషపాక రవికుమార్, ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చిట్యాల : ఈ నెల 29, 30వ తేదీల్లో జనగామలో జరగనున్న రజక వృత్తిదారుల మూడో మహాసభలను విజయవంతం చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెర్కు పెద్దులు కోరారు. మహాసభల ప్రచార పోస్టర్లను చిట్యాలలో శనివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, మాజీ జెడ్పీటీసీ పామనగుళ్ళ అచ్చాలు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఐతరాజు యాదయ్య, ఐతరాజు నర్సింహ, అక్కెనపల్లి నాగయ్య, రుద్రారపు పెద్దులు, నలపరాజు శేఖర్, కడకంచి నర్సింహ, ఏళ్ళ మారయ్య, తీగల కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం


నకిరేకల్ : జెండా ఎగురవేస్తున్న రాయి కృష్ణ

నకిరేకల్ : నకిరేకల్‌లో సీపీఐ ఎంఎల్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, లెనిన్ జయంతి వేడుకలను శనివారం న్యూ న్యూడెమొక్రసీ పార్టీ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత రాయి కృష్ణ, నాయకులు అంబటి చిరంజీవి, గద్దపాటి శంకర్, మామిడోజు వెంకటేశ్వర్లు, చెరుకు సైదులు, మహేష్, వడ్డె నవీన్, కొప్పుల ధనుంజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్ట్ పతాకం విడుదల

నకిరేకల్ : నక్సల్బరీ వసంత మేఘ గర్జన కాంతులు నలుదిశలా వ్యాపింపజేయాలని సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ పార్టీ జిల్లా కార్యదర్శి దుర్గం సైదులు కోరారు. 54 సంవత్సరాలు పూర్తి చేసుకున్న విప్లవ కమ్యూనిస్ట్ పార్టీ పతాకాన్ని నకిరేకల్‌లో శనివారం ఆయన విడుదల చేసి మాట్లాడారు. భూమి, భుక్తి, విముక్తి కోసం ఏర్పాటైన ఎర్ర జెండా తన లక్ష్యాలను చేరడానికి సంసిద్ధమవుతోందని అన్నారు. ఈ పోరాటంలోకి విద్యార్థులు, మేధావులు, కవులు, కళాకారులు అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దుబ్బ మధు, దుర్గం ప్రసాద్, నగేష్, మల్లయ్య, వెంకన్న, యాదయ్య, తిరుపతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి బీఆర్‌ఎస్‌లో చేరికలు

కేతేపల్లి : పేదల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల వారు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని బొప్పారం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 30 మంది నాయకులు, కార్యకర్తలు సర్పంచ్ కక్ర ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. వాటిని కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో దుర్గం దుర్గయ్య, అనంతమ్మ, బట్ట సైదులు, బట్ట విజయ్, మల్లమ్మ, గొల్లం లింగమ్మ తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

మునుగోడు : ఈ నెల 24న మునుగోడులో నిర్వహించే నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కోరారు. మునుగోడులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్న సభ స్థలాన్ని శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మేళనానికి మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు ఇతర ముఖ్య నాయకులు హాజరవుతారన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తంరెడ్డి, నాయకులు రావిరాల కుమారస్వామి, దుబ్బ రవి, వనం సురేష్, కిరణ్ తదితరులు ఉన్నారు.


సభా వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

నకిరేకల్ : అకాల వర్షం అన్నదాతలను నష్టాలపాలు చేసింది. శుక్రవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో నకిరేకల్ వ్యవసాయ మార్కెట్‌తోపాటు ఆయా గ్రామాల్లో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. నకిరేకల్ మార్కెట్‌లో కొంత మంది రైతులు ధాన్యం ఆరబోసుకుని ఉండడంతో వర్షానికి మురుగు కాల్వలోకి కొట్టుకుపోయింది. ఆయా గ్రామాల్లో మామిడి, నిమ్మ తోటల్లో కాయలు నేల రాలాయి. మండలం వ్యాప్తంగా మొత్తం 2 వేల బస్తాల ధాన్యం తడిసిపోయినట్లు అధికారులు గుర్తించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

చిట్యాల : అకాల వర్షానికి చిట్యాల మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదని చిట్యాల తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు తెలిపారు. గుండ్రాంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా ఆదివారం సైతం ధాన్యం దిగుమతి చేసుకునేలా రైస్ మిల్లర్లను ఒప్పించినట్లు తెలిపారు.

కనగల్ : ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాశులు తడవడంతో శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్‌రావు మండల వ్యవసాయాధికారి అమరేందర్‌గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షానికి ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్ కవర్లు కప్పుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని రంగు మారకుండా రైతులు ఆరబెట్టుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ఆయా సెంటర్ల నుంచి లారీల ద్వారా ఎగుమతి చేయాలని సూచించారు. వారి వెంట ఆర్‌ఐ యాదగిరి తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం : మండలంలో శుక్రవారం రాత్రి అకాల వర్షం కురవడంతో శనివారం పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి ధాన్యం తడిసి దెబ్బతినలేదని, కొనుగోలుకు ఎలాంటి ఆటంకాలు జరగవన్నారు. ఆయన వెంట ఆర్‌ఐ నవీన్‌కుమార్, కేంద్రాల నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

నేలకొరిగిన వరిచేలు

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలో శుక్రవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి రైతన్నకు భారీ నష్టమే జరిగింది. బలమైన ఈదురు గాలులకు కోతకు వచ్చిన వరి చేలు నేలకొరిగాయి. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్ట పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.


తిప్పర్తి మండలంలోని జంగారెడ్డిగూడెంలో ఈదురు గాలులకు నేలకొరిగిన వరి చేను

కేతేపల్లి : మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు ధాన్యం రాశులపై ఉంచిన పట్టాలు ఎగిరిపోయాయి. కేంద్రాల్లో స్థలం లేకపోవడంతో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులకు ఇబ్బందిగా మారింది.

కేతేపల్లి : అకాల వర్షానికి మండలంలోని పలు ఐకేపీ కేంద్రాల్లో తడిసిన ధాన్యం రాశులను శనివారం తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఏఓ బి.పురుషోత్తం పరిశీలించారు. కాంటాలు వేసి తడిసిన బస్తాలను ఆరబెట్టాలని కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. కాంటాలు వేసిన ధాన్యం బస్తాలను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు.

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ఎం. కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు తడవకుండా ఉండేందుకు ధాన్యం రాశులపై పట్టాలు కప్పుకోవాలని రైతులకు సూచించారు. సెలవు రోజుల్లో సైతం ధాన్యం తూకం వేసి మిల్లులకు పంపించాలని కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఆయన వెంట ఆర్.ఐ దుర్గామలేశ్వరి, వీఆర్‌ఏలు తదితరులు ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

చండూరు : కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు.. ధాన్యంపై టార్పాలిన్ కవర్లు కప్పాలని చండూరు తహసీల్దారు అర్చనారెడ్డి అన్నారు. శనివారం చండూరు మండల పరిధిలోని పలు ధాన్యం కేంద్రాలను సందర్శించి, రైతులకు సూచనలు చేశారు. అదేవిధంగా పుల్లెంల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఓ రైతుకు చెందిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. కొంతమేర ధాన్యం కొట్టుకుపోయింది. తహసీల్దారు బాధిత రైతుతో మాట్లాడారు. ఆమె వెంట ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు దీపక్ ఉన్నారు.


చిట్యాల : గుండ్రాంపల్లిలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు


నకిరేకల్‌లోని వ్యవసాయ మార్కెట్‌లో వర్షానికి తడిసి కొట్టుకుపోయిన ధాన్యం

నకిరేకల్ : వర్షానికి నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లోని మార్కెట్‌లో తడిసి ధాన్యాన్ని శనివారం పరిశీలించి మాట్లాడారు. ఆయన వెంట సుంకరబోయిన నర్సింహ, పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, యాసా కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అదేవిధంగా నకిరేకల్ మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ పరిశీలించారు. మ్యాచర్‌తో సంబంధం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆయన గాజుల సుకన్య, గార్లపాటి రవీందర్‌రెడ్డి, వంటెపాక నక్షత్ తదితరులు ఉన్నారు.

50 బస్తాల ధాన్యం కొట్టుకుపోయింది

నేను ఏడు ఎకరాల్లో వరి సాగు చేశా. వారం రోజుల క్రితమే 300 బస్తాల ధాన్యం నకిరేకల్ మార్కెట్‌కు తీసుకువచ్చా. మ్యాచర్ వచ్చింది కానీ కాంటాలు వేయలేదు. ధాన్యం మొత్తం ఆరబోసి ఉంచాను. శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో 50 బస్తాల వరకు మురుగు కాల్వలోకి కొట్టుకుపోయింది. మాకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి.

– దుర్గం జలంధర్, బొప్పారం రైతు, కేతేపల్లి మండలం

లక్షలు వెచ్చించినా లక్ష్యం నెరవేరదాయే !


పట్టణ ప్రగతి నిధులతో గత సంవత్సరం జిల్లా కేంద్రంలోని జిల్లా జనరల్ ఆస్పత్రి వెనుక భాగంలో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన లిక్విడ్ వేస్ట్ ట్రీట్మెంట్ అండ్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ కంప చెట్ల మధ్య నిరుపయోగంగా ఉంది. అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

కొనసాగుతున్న సమ్మె

మర్రిగూడ : మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 6వ రోజుకు చేరుకుంది. వీఓఏల మండల అధ్యక్షురాలు రంగినేని చంద్రకళ, కార్యదర్శి గంటా మంజుల, పురుషోత్తం, సిరియాల, భీమ్‌జీ, పాపాచారి పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. సమ్మెకు బీఎస్పీ నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేడి ప్రియదర్శిని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ముత్యాల రమేష్, గేర శేఖర్, లవకుమార్, వీఓఏల మండల అధ్యక్షురాలు బండ నాగమణి, కార్యదర్శి గద్దపాటి నాగేష్, ఉపాధ్యక్షురాలు పి. సులోచన, సుజాత, రమణ, శిరీష, శైలజ, సాయికుమార్, శ్రీధర్, జ్యోతి, నందిని ఉన్నారు.


మర్రిగూడ : సమ్మెలో పాల్గొన్న వీఓఏలు